క్లుప్తంగా

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని చక్రాయపాలెం వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని వెంపరాల గ్రామానికి చెందిన సోమబత్తిన మోహనగాంధీ అద్దంకి నుంచి వెంపరాల గ్రామానికి అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై బైకుమీద వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని చక్రాయపాలెం గ్రామం వద్ద బ్రిడ్జి దాటగానే బైకు అదుపుతప్పి కిందనున్న రోడ్డుపై పడ్డాడు. దీంతో మోహన్‌గాంధీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

గుడ్డ సంచులతో ప్లాస్టిక్‌కు చెక్


ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

బల్లికురవ: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగించకుండా గుడ్డ సంచులు వాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, వేటపాలెం అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వై జాన్సన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గొర్రెపాడు ఫారెస్ట్ కొండ పరిధిలోని కొప్పరపాడు గ్రామంలో ప్రజలకు, ఉపాధి కూలీలకు ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహనతో ప్లాస్టిక్ వాడమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కూకట్లపల్లి ఫారెస్టు ఫీల్డ్ ఆఫీసర్ కె. రమేష్, అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ ఏ. శ్రీనివాస్, పాల్గొని మాట్లాడారు

ఆశ్రమ భవన నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు సోదరులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నూతనంగా నిర్మిస్తున్న అమ్మ అనాథాశ్రమ నూతన భవన నిర్మాణం కోసం దాతలు మంగళవారం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. యూటీఎఫ్ నాయకుడు అడుగుల శ్రీనివాసరావు, ఆయన సోదరులు సూర్యప్రకాష్, చంద్రశేఖర్‌లు నగదును ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు దంపతులకు అందజేశారు.

వైభవంగా పోలేరమ్మవారి శిడిమహోత్సవం


శిడిమాను ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వేటపాలెం: నాయినిపల్లిలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి 47వ శిడి మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిడిమానుకు శిడిపోతును కట్టి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శిడిమానోత్సవాన్ని తిలకించారు.

ఈఏపీసెట్‌కు 432 మంది హాజరు

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఏపీ ఈఏపీసెట్ –2023 పరీక్షలకు 432 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. సెట్ పరీక్షలు ఈరోజుతో ముగిశాయని తెలిపారు. మొత్తం 470 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 432 మంది హాజరైనట్లు, 38 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షలను డి సమీర్‌కుమార్ పర్యవేక్షించారు.

అప్పారావుకు ఘన నివాళులు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జేఎన్‌టీయూకే యూనివర్సిటీ ఫౌండర్, వైస్ చాన్స్‌లర్ అల్లం అప్పారావు ఆకస్మిక మృతికి కళాశాల యాజమాన్యం మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు మాట్లాడుతూ జేఎన్‌టీ యూనివర్సిటీలో 2008 నుంచి 2011 వరకు వైస్‌చాన్స్‌లర్‌గా విధులు నిర్వహించి యూనివర్సిటీని అభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవా సారథులు

- వలంటీర్లకు సేవా పురస్కారాలు ప్రదానం
- ఉత్సాహం నింపుతున్న కార్యక్రమం
- నియోజకవర్గంలో 1238 మంది ఎంపిక


వలంటీర్లను సన్మానిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య (ఫైల్)

జే.పంగులూరు: అది నెల ఒకటో తారీఖు. ఉదయం ఐదు గంటలు.. ఓ ఇంటి తలుపు దగ్గర సూరమ్మ అవ్వా తలుపు తీయి.. నేను వలంటీర్ లక్ష్మిని పింఛన్ ఇవ్వడానికి వచ్చా.. అని ఉత్సాహంగా గట్టి గొంతుతో పలకరింపు. ఆపలకరింపుతోనే ఇంట్లో ఉన్న సూరమ్మ అవ్వ నిమిషం కాకముందే సంతోషంగా బయటకు వచ్చి పింఛన్ తీసుకొని వలంటీర్‌ను ఆశీర్వదించింది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మానసపుత్రికలైన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థకు దేశంలో ఒక గుర్తింపు లభించింది. సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తూ అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధులుగా నిలిచారు. అంతేకాదు గ్రామంలో ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వేరే ప్రాంతాలకు సైతం వెళ్లి పింఛన్ అందించి సేవాతత్పరత చాటుకున్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందిస్తూ పేదల కన్నీళ్లను తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకొచ్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ప్రతి నెల ఒకటో తేదీ తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు కొంత ఒరవడి సృష్టించారు. వీరు చేస్తున్న సేవకు ప్రభుత్వం ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తోంది. కొత్త ఆలోచనలతో వలంటీర్ వ్యవస్థకు సీఎం జగన్ జీవం పోశారు. వలంటీర్లుగా బాధ్యతలు తీసుకున్న వారంతా యువ సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు మెచ్చి ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ. 30 వేలు నగదు, సేవారత్నకు రూ. 20 వేలు నగదు, సేవా మిత్రకు రూ. 10 వేలు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్ అందించనున్నారు. సేవా పురస్కారాలతో పాటు వలంటీర్లను బ్యాడ్జీతో పాటు శాలువాతో సత్కరిస్తున్నారు. దీంతో వలంటీర్ల సేవలను ప్రజలు కొనియాడుతున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు, వలంటీర్లు..

మండలం	సచివాలయాలు	వలంటీర్లు	సేవావజ్ర	సేవారత్న	సేవామిత్ర
జే.పంగులూరు	14	252	0	05	247
అద్దంకి	20	243	2	5	236
కొరిశపాడు	15	256	2	5	249
సంతమాగులూరు	20	338	0	5	263
బల్లికురవ	20	249	1	5	243

బాధ్యత మరింత పెంచింది.



నాకు సేవావజ్ర అవార్డు వరించడం మరింత బాధ్యత పెంచింది. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్నాను. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను పూర్తి చేసి అధికారుల మన్ననలు పొందేందుకు ఈ అవార్డులు దోహదపడతాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు అన్ని విధాల ప్రోత్సాహిస్తున్నారు.

– దాసరి శాంతి, వలంటీరు, మణికేశ్వరం

నాకు సంతృప్తినిచ్చింది..



అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిలా పనిచేయటం, ప్రజల ఇంటికే ప్రభుత్వ పథకాలు చేరేలా చూడడం నా బాధ్యత. సీఎం వైఎస్ జగనన్న పాలనలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావిస్తున్నాను. సంక్షేమ పథకాలు అమలు చేయడం సంతృప్తినిస్తోంది. సేవావజ్ర పురస్కారానికి నేను ఎంపిక కావడం మరింత సంతోషంగా ఉంది.

దాసరి సుధాకర్, వలంటీర్, మణికేశ్వరం

సీఎం జగనన్న ఆశయ సాధనకు కృషి...



నాకు సేవారత్న అవార్డు రావడం నాలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్తమ సేవలు అందించడం నా ధ్యేయం. నెల మొదటి రోజే వృద్ధులకు పంఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగనన్న ఆశయాలను నెరవేర్చేందుకు వలంటీర్‌గా నేను ఎప్పుడు సిద్ధంగా ఉంటా.

అద్దేపల్లి సరళ, వలంటీర్, తూర్పుకొప్పెరపాడు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని అక్కా యిపాలెం, కొత్తపేట, రోశయ్య కాలనీ, సంపత్ నగర్, లక్ష్మీపురం ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. లక్ష్మీపురంలోని శ్మశానవాటిక ప్రహరీ పనులను పరిశీలించారు. స్వామి వివేకానంద కాలనీలో జరుగుతున్న మంచినీటి పైపులైన్లను పరిశీలించారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవ నిర్మాణాల పనులను పరిశీలించారు. త్వరతగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, మాజీ సర్పంచ్ చుండూరు వాసు, లేళ్ల శ్రీధర్, జంగిలి రామారావు, దంతం హనుమంతరావు, అందే కృష్ణ, కర్ల లక్ష్మణరావు, కర్ల కృష్ణమోహన్, కట్టా దాసు, సెక్రటరీ శ్రీనివాసులు, శివలీల తదితరులు పాల్గొన్నారు.

చీరాల: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దిత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కరణం అన్నారు. మంగళవారం ఆయన చీరాల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. రోశయ్యకాలనీ, సంపత్‌నగర్, మూడు రోడ్ల సెంటర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో పర్యటించి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట చీరాల, వేటపాలెం మండలాల ఎంపీడీఓలు నేతాజీ, పార్టీ నాయకులు దితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్‌లకు పురస్కారాలు

యద్దనపూడి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 24వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు వలంటీర్‌లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణకుమారి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు హాజరుకావాలని ఆమె కోరారు. వలంటీర్‌లు ఎంపీడీవో కార్యాలయంలో హాజరు తప్పనిసరి అని ఆమె ఆదేశించారు.

28న చైతన్య భారతి సర్వసభ్య సమావేశం

చీరాల అర్బన్: సాంస్కృతిక సమితి, చైతన్యభారతి సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక ముంతావారిసెంటర్‌లోని ఎన్వీఎస్ఎస్‌జేఆర్ కళ్యాణ మండపం మేడపైన నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్, భాగి నారాయణశాస్త్రిలు మంగళవారం ఇక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నిక అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నీటి తీరువా బకాయిలు వసూలు చేయాలి


వీఆర్వోలతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

ఇంకొల్లు (చినగంజాం): మండల పరిధిలోని నీటి తీరువా బకాయిలను పూర్తి చేసే విధంగా సిబ్బంది కృషి చేయాలని బకాయిలను వెంటనే వసూలు చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో రూ 20.63 లక్షలు నీటి తీరువా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, మొత్తం రూ.43.07 లక్షలు కాగా వాటిలో రూ 23.43 లక్షలు వసూలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ గీతారాణి, ఆర్ఐ లక్ష్మి కుమారి, వీఆర్వో శేషు, కృష్ణ, ప్రసాద్, శ్రీలత, వాణి పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో సేవా విప్లవం


వలంటీర్‌ల సన్మాన సభలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు


వలంటీర్‌లకు సన్మానం చేస్తున్న ఎంపీపీ ఆనందకుమారి, నాయకులు

చినగంజాం: రాష్ట్రంలో సీఎ వైఎస్ జగన్ మోహనరెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి సేవా విప్లవం తీసుకొని వచ్చారని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతి ఏడాది గ్రామ వలంటీర్‌లకు అందించే పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్‌లను సత్కరించి మాట్లాడారు. అనంతరం వలంటీర్‌లు పట్టాభి నాగరాజు, కుప్పాల మానసలకు సేవా వజ్ర, పొగర్తి గోపి, దండుప్రోలు నాగరాజు, కొత్తగొర్ల లక్ష్మీనారాయణ, మరుప్రోలు మోహన స్రవంతి, మెర్సీలకు సేవారత్న, సేవా మిత్రలుగా మరో 201 మంది వలంటీర్‌లకు సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కే స్వరూపరాణి, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్‌లు గొల్లమూరి శివకుమారి, సైకం మణి, ఏఈపీఆర్ డీ దాసు పాల్గొన్నారు.

వలంటీర్‌ల సేవా దృక్పథం కొనియాడదగినది..

పర్చూరు (చినగంజాం): వలంటీర్‌లు ప్రజలకు అందిస్తున్న సేవా దృక్పథం కొనియాడదగినదని ఎంపీపీ మేకా ఆనంద కుమారి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం నందు వలంటీర్‌ల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం సేవా వజ్ర 1, సేవారత్న 5, సేవా మిత్ర 286 మందికి అందజేశారు. వీరికి శాలువా కప్పి, మెడల్‌తో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీ లక్ష్మీదేవి, వైస్‌ఎంపీపీ కోట ప్రసన్న, పాలేరు వీరయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కొల్లా సుభాష్, నాయకులు మల్లా శ్రీనివాసరావు, ఒగ్గిశెట్టి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై అప్రమత్తత అవసరం


గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ సౌమ్య, వైద్య సిబ్బంది

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణుల్లో రక్తహీనతపై అవగాహన ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సౌమ్య అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కుంకలమర్రు తుఫాన్ షెల్టర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్నారు. గర్భిణులకు రక్తపరీక్షలతో పాటు, స్కానింగ్‌లు కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనతతో ఉండే వారిపై గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశలు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రత్యేక దృష్టి పెడతారని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ వసుధ, ఆర్ నాగమల్లేశ్వరి, బాజీ, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారాలతో మరింత బాధ్యత


మేదరమెట్లలో వలంటీర్‌కు పురస్కారం అందిస్తున్న కృష్ణచైతన్య

మేదరమెట్ల: వలంటీర్ల సేవలకు గుర్తింపుగా వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, కొరిశపాడు గ్రామాల్లో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మండలంలో మొత్తం 15 గ్రామ సచివాలయాల్లోపనిచేస్తున్న 256 మందికి పురస్కారాలు అందించారు. వీరిలో సేవావజ్ర పురస్కారాలు ఇద్దరికి, సేవారత్న ఐదుగురికి, మిగిలిన 249 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందచేసినట్లు ఎండీవో సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కారాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్‌లు బొనిగల ఎలీశమ్మ, విజయకుమార్, నాదెండ్ల దశరథరామయ్య, సాధినేని మస్తాన్‌రావు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేరాలి


గర్నెపూడి గ్రామంలో పర్యటిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం మండలంలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని గర్నెపూడి, గోరంట్లవారిపాలెం, ఎడారిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామంలోని వివిధ దేవాలయాల్లో పూజలు చేశారు. అనంతరం దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అన్నంబొట్ల వారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాలు ఆయా కుటుంబాలకు అందుతున్న తీరు, ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన పర్యటన కొనసాగించారు. వైఎస్సార్ రైతు పథకం ద్వారా ట్రాక్టర్ మంజూరు కాగా ఆయన దానిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో లక్ష్మీదేవి, ఏఈ బ్రహ్మయ్య కార్యదర్శి ఎల్‌కే కృష్ణ, పర్చూరు గర్నెపూడి సర్పంచ్ బిరుదు నాగేంద్రమ్మ, గోరంట్ల భాస్కర్‌రావు, మండల కన్వీనర్ కఠారి అప్పారావు, వంకాయలపాటి వీరయ్య, గోరంట్ల శివకుమారి, కొనకంచి సుబ్బారావు, చిన్నపాటి నాగేశ్వరరావు, తోకల కృష్ణమోహన్, దగ్గుబాటి రామకృష్ణ, ఉప్పలపాటి అనిల్, గోరంట్లబాబు, కొల్లా రామకృష్ణ, గన్నేటి సత్యనారాయణ, పఠాన్ అక్బర్, అలనేటి చెన్నయ్య, విష్ణుమూర్తి, మాజీ సర్పంచ్ గోరంట్ల సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు ఉత్సాహంగా విద్యార్థులు


బల్లికురవ: విద్యార్థులచేత ఆటలు ఆడిస్తున్న లైబ్రేరియన్


అద్దంకిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జ్యోతి చంద్రమౌళి

బల్లికురవ: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణకు ప్రతి రోజు విద్యార్థులనుంచి విశేష స్పందన లభిస్తోందని బల్లికురవ గ్రంథపాలకుడు రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన శిక్షణలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు..

అద్దంకి రూరల్: అద్దంకి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 16రోజు మంగళవారం పాల్గొన్న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ చుండూరు సుగుణరావు, అద్దంకి సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతి చంద్రమౌళి, ఉపాధ్యాయుడు వీరురాజు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను ఉపయోగించుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ డీ.ధనమ్మ అన్నారు. శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం పిల్లల చేత పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఫ్యాకల్టీ డి.హేమంత్‌కుమార్ దేశభక్తి గీతాలు, ఉపాధ్యాయులు వీ సాయికుమార్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు బోధించారు. అలానే మానసిక ఉల్లాసం కోసం డ్యాన్స్, క్యారమ్స్, ఆటల పోటీలు నిర్వహించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మహిళలకు బ్రోచర్ అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని, నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో మూడో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ దేశ చరిత్రలో ఇదివరకు ఎవరూ.. అమలు చేయలేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నకి మాత్రమే దక్కుతుందన్నారు. పథకాల అమలు తీరు, పరిపాలనను గ్రామస్థాయికి తీసుకువచ్చి వచ్చిన జగనన్నను మరోమారు సీఎం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. చంద్రబాబు తను అధికారంలోకి వస్తే పేదలను కోటీశ్వరులను చేస్తాను అని చెప్పటం ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా సేవా దళ్ అధ్యక్షుడు పులికం కోటిరెడ్డి, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాస రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ పూసల గంగాధర్, సర్పంచ్ రౌతు సాంబశివరావు, రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు రామాంజినేయులు, కామేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.